## : 3 :

రాములన్నయ్యకు గొప్ప శాస్త్రవేత్త కావాలని! ఎప్పుడు పడితే అప్పుడు "మా సైంటిస్టులు ఇది ఒప్పుకోరు, అది ఒప్పుకోరు." అంటూంటాడు. ఏవేవో పుస్తకాలు తెచ్చి చదువుతూ ఉంటాడు. అందులో ఏవైనా బొమ్మ లుంటే అన్నపూర్ణకు చూపించి వాటినిగురించి చెబుతూ ఉంటాడు. అన్నపూర్ణకు అవన్నీ అర్థం కావు.

ఒకసారి రాములన్నయ్య ఒక పుస్తకం తెప్పించి అందులో చంద్రుడి బొమ్మా ఇంకేవో బొమ్మలూ చూపించాడు. అందులో ఒక బొమ్మ దీపావళికి వెలిగించే విష్ణుచక్రమల్లే ఉంది. అయితే గుండ్రంగా లేదు; కోలగా ఉంది. అదేమిటంటే అదొక బ్రహ్మాండ మన్నాడు. ఇంకో బొమ్మచూపించి అది అండాండమనీ, మరోబొమ్మచూపించి పిండాండమనీ అన్నయ్య చెప్పాడు.



"మరి నువ్వు దేవుడు లేడంటావుగదా ఇవన్నీ ఎవరు చేశారు?" అన్నది అన్నపూర్ణ.

"వీటిని ఒకరు చేస్తారా? వాటంతట అవే జరుగుతై. ప్రకృతి నియమం. సూర్యుడి చుట్టూ భూమితిరుగుతున్నది. ఎవరూ దాన్ని తిప్పక్కర్లేదు. తిరిగే భూమిని ఆపటానికి ఏ భగవంతుడున్నా రావాలి. విత్తులోంచి చెట్టు పుడుతుంది. ప్రకృతి నియమం." అన్నాడు రాములన్నయ్య.

"ఒకవేళ పుట్టకపోతే? అప్పుడు నువ్వూ నేనూ పాతిపెట్టిన మామిడి టెంక మొలవలేదు. జ్ఞాపకం ఉందా?" అన్నది అన్నపూర్ణ.

"దానికింకేదో ప్రకృతి నియమం అడ్డుపడి ఉండాలి." అన్నాడు రాములన్నయ్య, గంభీరంగా.

"ఈ నియమాలన్నీ దేవుడే చేస్తున్నాడేమో?" అన్నది అన్నపూర్ణ.

"అదే పొరపాటు. దేవుడంటే మనిషి మాదిరిగానే ఉంటాడనీ, ఉంటే ఇంకో రెండు చేతులుంటాయనీ మనవాళ్ల ఉద్దేశం. మనకుండే బుద్ధులే దేవుడికీ ఉంటాయని మనం

అనుకుంటాం. అయితే నీకొకసంగతి తెలుసా? ఒకప్పుడు భూమిమీద మనుషులే లేరు. ఇంకా అంతకు ముందు చెట్లూ చేమలూ కూడా లేవు. ఇవాళ సూర్యుడిలో నిప్పు తప్ప ఇంకేమీ లేదు. ఒకప్పుడు భూమిమీద కూడా అంతే. అసలు మనుషులే లేకముందు మనిషిలాంటి దేవుడుండే వాడని ఎట్లా అనుకోవటం?'' అన్నాడు అన్నయ్య.


అన్నపూర్ణకు ఇదంతా రాములన్నయ్య కల్పనే అనిపించింది. కాని మనిషి లేనప్పుడుండిన జంతువులను గురించి అన్నపూర్ణ అన్నయ్యచేత చాలా విషయాలు చెప్పించుకుని విన్నది. ఒకప్పుడు ప్రపంచంలో పెద్దపెద్ద రథాలంతేసి బల్లులుండేవిట. అవి పొడుగాటి తోకలు ఝాడిస్తూ రొచ్చులో గెంతుతూ ఉంటూఉంటే భూకంపం వచ్చినట్టుగా ఉండేదిట. ఈ బల్లుల



ఇంతవరకూ ప్రపంచంలో ప్రభవించిన స్థలచర జంతువు లన్నిటిలోకీ డిప్లొడోకస్ పిక్కిలి పెద్దది. డైనోసార్ అనే చతుష్పాత్సరీసృపాలజాతికి చెందిన ప్రాణి ఇది. ఈ జాతి ఇప్పుడు నిర్మూలమైపోయింది. డిప్లొడోకస్ 80 అడుగుల పొడవువరకూ పెరిగేది. దీనికి తలలోకంటె వెన్నెముకలో ఎక్కువ మస్తిష్కం ఉండేది. దీని తోకా వెనకకాళ్లయొక్క చలనానికి పృష్ఠంలోని మెదడే ఉపయోగపడేది.

బొమ్మలుకూడా రాములన్నయ్య తరవాత తెచ్చి చూపించాడు. ఒక్కటికూడా లక్ష్యపెట్టకుండా అన్నపూర్ణ ఇంట్లో దీపం ముందర కూచుని ఆ బొమ్మలన్నీ చూచింది.

"ఏంవే, నువ్వు దీపం ఆర్పి బయటికి వచ్చి పడుకుంటావా? నన్ను బయట తాళం వేసుకుని వెళ్లమన్నావా?'' అని అడిగింది అమ్మ. నడివేసవి కాలం. అందరూ ఆరుబయట పడుకుంటున్నారు. అన్నపూర్ణ బలవంతాన పుస్తకంమూసి దీపం ఆర్పేసి బయటికి వచ్చి రాములన్నయ్య మంచంపక్కనే తన మంచంమీద పడుకున్నది.



అమెరికాలోని పాలోమార్ పర్వతంమీదఉన్న 200 అంగుళాల దూరదర్శనిలో నుంచి చూస్తే 18,000 మైళ్ల దూరంలో ఉన్న ఒక కొవ్వొత్తి వెలుగుకూడా కనిపిస్తుంది.

రాములన్నయ్య మేలుకునే ఉన్నాడు. వెల్లకిలా పడుకుని నక్షత్రాల కేసి చూస్తున్నాడు.

"ఆరోజుల్లో సినిమాలుంటే బలేబాగుండేది కాదూ?'' అన్నది అన్నపూర్ణ.

"ఏరోజుల్లో?'' అన్నాడు రాములన్నయ్య.

"ఆ పెద్ద పెద్ద బల్లులున్న రోజుల్లో. వాటిని ఎవరన్నా సినిమా తీస్తే మనం చక్కగా వాటిని చూచి ఉండేవాళ్లం.'' అన్నది అన్నపూర్ణ.

"అప్పటికి మనుషులే లేరు. కెమెరాలు లేవు, ఫిల్ము లేదు. అందాకా ఎందుకు? అమ్మమ్మా వాళ్లనాన్న సినిమా చూచి ఉండరు." అన్నాడు రాములన్నయ్య. అతను కాసేపుండి, "ఆ కనబడే నక్షత్రాల మధ్య మన భూమి వంటిది ఉండి, అందులో మనుషులున్నారనుకో. వాళ్లు భూమికేసి టెలిస్కోపులతో చూస్తే భూమి మీద ఆ బల్లులు కదులుతూ కనపడవచ్చు." అన్నాడు.

అన్నపూర్ణ అర్థంచేసుకున్నది. ఆ నక్షత్రాలనుంచి కాంతి మనదాకా రావటానికి ఒక్కోసారి కోట్లకొద్దీ సంవత్సరాలు పడుతుందిట. అంతదూరంనుంచి టెలిస్కోపులతో ఈ భూమిమీద జరిగేది చూడటం అసంభవం. ఆ సంగతి రాములన్నయ్యకు తెలుసు. అయినా అన్నపూర్ణను తృప్తిచెయ్యటానికి అతను అట్లా చెప్పాడు. జనసామాన్యంకోసం శాస్త్రవిషయాలు రాసేవారిలక్షణాలు రాములన్నయ్యలో కొన్ని లేకపోలేదు.

"ఏ నక్షత్రంలోనుంచన్నా చూస్తే అమ్మమ్మ చిన్నపిల్లగా ఇప్పుడు కనిపిస్తుందా?" అని అడిగింది అన్నపూర్ణ.

"ఓ!" అన్నాడు రాములన్నయ్య.

అన్నపూర్ణ కళ్లుమూసుకుని కాసేపట్లో నిద్రపోయింది. ఆమెకు కలలో పెద్దపెద్ద బల్లులు గెంతుతూ కనిపించాయి. అందులో ఒక బల్లి మెడచాచుకుని అన్నపూర్ణ వేపు వచ్చింది. దగ్గిరగా చూస్తే దానిముఖం అమ్మమ్మ ముఖంలాగే ఉంది.

:- 4 -:

అన్నపూర్ణ స్కూల్ ఫైనల్ పరీక్షల బరువు దించేసుకున్నది. ఈ పరీక్షలో పాసయినా, తప్పినా ఇక మరి చదువులేదు. అప్పుడే ఆమె జీవితంలో ఒక యుగం అయిపోయి ఇంకో యుగం ప్రారంభం కాబోతున్నది. పెద్దవాళ్లు సంబంధాలు చూస్తున్నారు.

అన్నపూర్ణకు సంబంధం చూడాలంటే అట్టే దూరం పోనవసరం లేదు. బంధువుల బలగం చాలా ఉంది. అన్నపూర్ణకు ఈడయిన వాళ్లు ముగ్గురు, నలుగురున్నారు. వాళ్లలో ఎవరా అనేది తేల్చుకుంటే మూడుముళ్లూ క్షణంలో పడిపోతై. వాళ్లుకూడా నలుగురూ నాలుగు రకాలు. ఒకడికి చదువూ, తెలివీ ఉన్నాయి. ఒకడు అన్నపూర్ణకు ఈడూజోడుగా ఉంటాడు. ఒకడికి కాస్త మంచి ఆస్తి ఉంది. ఏ ఒకర్ని చేసుకున్నా మిగిలిన వాళ్లు కాస్త గునుస్తారు. ఎందుకంటే అన్నపూర్ణ చక్కనిపిల్ల. ఇంత బలగంలోనూ కనుముక్కుతీరు పిల్లలు ఏ ఇద్దరు ముగ్గురో మాత్రమే ఉన్నారు. ఎవరూ నొచ్చుకోకుండా ఏదో ఒక సంబంధం నిశ్చయించటానికి చర్చలు సాగుతున్నై.

రాములన్నయ్యకు ఈ సంబంధాల్లో ఒకటీ నచ్చలేదు. నిజానికి అన్నపూర్ణకుకూడా ఏ సంబంధమూ నచ్చలేదు. కాని సంబంధం విషయంలో తల్లిదండ్రులు చెప్పినట్టు రాజీపడదామనుకుంది. కాని రాములన్నయ్య తన అభిప్రాయం చెప్పినమీదట అన్నపూర్ణకి కూడా ఈ సంబంధాలను తోసెయ్యాలనిపించింది.

అందరూ భోంచేస్తున్న సమయంలో నాన్న రాములన్నయ్యతో, "ఏంరా? అమ్మడికి ఎవరిని

చేస్తే బాగుంటుందంటావు? సీతాపతి మంచి ఉద్యోగంలో ఉన్నాడు. సుబ్బారావుకు ఆస్తి ఉంది. లక్ష్మీకాంతం చూట్టానికి బాగుంటాడు.'' అన్నాడు.

రాములన్నయ్య వెంటనే సమాధానం చెప్ప లేదు. అతను కాస్సేపుండి మాట్లాడటం మొదలుపెడితే అన్నపూర్ణ ఇంకేదో విషయం మాట్లాడుతున్నాడనుకుంది.

"పూర్వం కోతులు అడివి చెట్లమీదే ఉండేవి. నేలమీదికి దిగివచ్చేవి కావు. అవి ఉండే చెట్ల చుట్టూ రింగులాగా చెట్లుకొట్టేస్తే వాటిపని ఖైదులో ఉన్నట్టయి పోయేది. మన సంగతి అట్లాగే ఉంది. ఇంత ప్రపంచం ఉంది. రైళ్లూ, రేడియోలు ఉన్నై. ఉద్యోగాల కోసం జనం వేలకొద్దీ వెళ్లిపోతున్నారు. మనం అమ్మడికి మొగుణ్ణి వెతకాలంటే మనమురికి గుంటలోనే వెతకాలి!'' అన్నాడు రాములన్నయ్య.

"అయితే ఇంకేం, నువ్వు మంచి సంబంధం తీసుకురా.'' అన్నాడు నాన్న.

"నాకోసం వస్తాడే సుదర్శనం? వాడికిచ్చి చెయ్యండి.'' అన్నాడు అన్నయ్య.

"వాళ్లు మనశాఖకాదే?'' అన్నాడు నాన్న.

"ఏం శాఖో, ఏట్లో శాఖ. మా సైంటిస్టులకు ఈ శాఖల్లో నమ్మకం లేదు. ఒకప్పుడు మన పూర్వీకులు చెట్లమీద ఉండేవాళ్లు, ఇంకా అంతకు పూర్వం మడుగుల్లో ఉండే వాళ్లు. ఇంకాపూర్వం నీళ్లల్లో ఉండేవాళ్లు. మనం ఏశాఖ?'' అన్నాడు రాములన్నయ్య ఉపన్యసించేవాడల్లే.



ఆ ప్రస్తావన అక్కడితో ముగిసింది.

ఆ సాయంకాలం అన్నపూర్ణ వసారాలో కూచుని జడవేసుకుంటుండగా ఒక ముసలివాడు వచ్చాడు. మోకాళ్లదాకా ఒక కొల్లాయి గుడ్డ కట్టుకున్నాడు. మీద ఇంకో కొల్లాయిగుడ్డ వేసుకున్నాడు. చంకలో ఏదో మూట ఉన్నది. పుస్తకంలో చూచిన జావామనిషికిమల్లే కనిపించాడు అన్నపూర్ణకు.

"మహాలక్ష్మి ఉందిట్రా?" అన్నాడాయన అన్నపూర్ణకేసి చూడకుండా దిక్కులు చూస్తూ.

"అమ్మా." అని కేక వేసింది అన్నపూర్ణ. అమ్మ లోపల్నించివచ్చి, "నువ్వా, తాతయ్యా? రా, రా. ఎప్పుడు రావటం?" అంటూ అమ్మ ఆయన్ని పరామర్శించింది.

ఆయన అమ్మమ్మ ఆఖరు తమ్ముడట, అమ్మ చెప్పింది. ఆరాత్రి అమ్మ ఆయనకోసం మడికట్టుకుని వంటచేస్తుంటే చూస్తే అన్నపూర్ణకు ఏ నక్షత్రం నుంచో చూస్తున్నట్టుగా కనిపించింది. నాన్నకోసం అమ్మ ఎప్పుడూ మడికట్టుకోదు.

భోజనాల దగ్గర అన్నపూర్ణ పెళ్లి విషయం వచ్చింది.

"ఇది అచ్చు మా అన్నపూర్ణక్కయ్యే. దాన్ని అడక్కుండా ఏ సంబంధమూ చెయ్యకండి. మా అన్నపూర్ణమ్మకిట్లాగే చిన్నప్పుడు మా నాన్న సంబంధం ఏదోచూస్తే చెప్పకుండా ఇంటినుంచి బయలుదేరి పోయింది." అన్నాడు జావా మనిషి.

ఈ మాట వింటూంటే అన్నపూర్ణకు అమ్మమ్మమీద ఎక్కడలేని గౌరవమూ వచ్చింది. తన కిష్టం లేని సంబంధం చేస్తే తానుకూడా అమ్మమ్మలాగే ఇంట్లోనుంచి వెళ్లిపోదామనుకుంది అన్నపూర్ణ.

## భార్య

ప్రపంచ సౌభాగ్యాల్లో ఉత్తమమైంది మంచి భార్య; చెడ్డ భార్య మానవ జీవితానికి నరక యాతన — సిమొనైడ్స్

ఒక దైవం; ఒక భార్య; చాలామంది మిత్రులు — డచ్

వివేకి అయినవాడు దేనికీ భయపడడు; కాని తన కంటె ఎక్కువ తెలివిగా ఉండే భార్యను చూస్తే మాత్రం హడల్ — ఫీల్డింగ్

ఒకే యింట్లో రెండు పుంజులూ, రెండు పిల్లులూ, ఒక ఎలుకా, ముసలివాడూ పకచు పెళ్లామూ ఉంటే రభస తప్పదు — డచ్

మనుష్యుని జీవితంలో రెండే మంచి దినాలు — పెళ్లాడిన రోజూ, పెళ్లాన్ని పూడ్చిపెట్టిన రోజూ — పంచ్

నీ భార్యను గాడిదను చేశావంటే, నిన్నావిడ ఎద్దును చేస్తుంది — స్పానిష్

ఇతరులు వింటూఉండగా, లేక చూస్తూ ఉండగా భార్యను తిట్టావద్దు, పొగడావద్దు — డచ్